www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 13 నవంబర్ 2025

5

ఏలూరు

## పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలో 2026 సంవత్సరంలో జరగనున్న కామన్ పరీక్షల నేపథ్యంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఏలూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఆఫీసర్ ఆశ ముందస్తుగా పరిశీలించారు. కెజిబివి జెడ్‌పి ఎస్ఎస్ హెచ్‌లో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు తాగునీరు, కూర్చోవడానికి సౌకర్యాలు, భద్రతతోపాటు అన్ని ప్రాథమిక వసతులు వంద శాతం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, మంచి విద్యా ప్రమాణాలు పెంపొందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థికీ అపార్ ఐడి సృష్టి వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యలగూడెం డెప్యూటీ డిఇఒ రామన్నదొర, మండల విద్యాశాఖ అధికారులు కృష్ణప్రసాద్, గిరి భగవాన్‌దాస్, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కెజిబివి ఎస్ఒ సుశీల పాల్గొన్నారు.

# జిల్లాలపై సస్పెన్స్..!

**క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోకుండా మౌనం**

**మళ్లీ ప్రక్రియను పక్కకు పట్టేశారా అన్న అనుమానాలు**

**నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలపై ఉత్కంఠ**

**రెండు డివిజన్లతో జిల్లాల ఏర్పాటు ప్రచారంపై చర్చ**

**ప్రభుత్వం ఏకపక్షంగా వెళ్తోందన్న అభిప్రాయం**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాల విభజనలో మార్పులు చేర్పులపై ప్రభుత్వం మౌనం దాల్చిన పరిస్థితి నెలకొంది. ఈ నెల పదో తేదీన జరిగిన మంత్రి మండలి సమావేశంలో జిల్లాల్లో మార్పులపై కచ్చితమైన నిర్ణయం వస్తుందని ప్రజాప్రతినిధులు చెప్పారు. అయితే అందుకు విరుద్ధంగా మంత్రి మండలి సమావేశంలో జిల్లాల మార్పులు, చేర్పుల ఊసేలేకుండా పోయింది. దీంతో జిల్లాల మార్పులపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందా అన్న అనుమానాలు నెలకొన్నాయి. జిల్లాల మార్పులు చేర్పుల ప్రక్రియలో ఏలూరు జిల్లాపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్న ప్రచారం సాగుతోంది. దీంతో ఏలూరు జిల్లాలో ఇంక రెండు డివిజన్లు మాత్రమే మిగలనున్నాయి. అతిచిన్న జిల్లాగా మారనుండడంతో జనంలో తీవ్ర చర్చ సాగుతోంది. ఈ ప్రక్రియపై ప్రజాప్రతినిధుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనట్లు తెలుస్తోంది.



రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లోనూ ఇలాంటి సమస్యలు ఉండడంతో ప్రభుత్వం సందిగ్ధంలో పడినట్లు సమాచారం. గత వైసిపి ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో జిల్లాల విభజన చేసింది. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికగా జిల్లాల విభజన జరిగింది. గతంలో కృష్ణా జిల్లాలో ఉన్న కైకలూరు, నూజివీడు నియోజకవర్గాలు ఏలూరు పార్లమెంట్ స్థానంలో ఉండేవి. జిల్లాల విభజన నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలో కలిపారు. అక్కడి ప్రజలు మాత్రం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఎన్నికల్లో నూజివీడులోని బహిరంగ సభలో పాల్గొన్న చంద్రబాబుకు దీనిపై అక్కడి నాయకులు, ప్రజలు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దీంతో అధికారంలోకి వచ్చాక నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామంటూ చంద్రబాబు మాటిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాలను కలుపుతూ పోలవరం నియోజకవర్గం ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోతోంది. దీంతో జిల్లాల విభజన మార్పులపై మంత్రుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మంత్రుల కమిటీ జిల్లాల్లో పర్యటించి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన తర్వాత మార్పులు చేర్పులు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. మంత్రుల కమిటీ ఏ జిల్లాలోనూ పర్యటించలేదు. అమరావతికి వచ్చిన వినతులను మాత్రమే తీసుకుని జిల్లాల మార్పులపై నివేదికను తయారు చేసేసి సిఎంకు ఇచ్చింది. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపనున్నట్లు బయటకు సమాచారం వచ్చింది. పోలవరం జిల్లా లేనట్లుగా పేర్కొన్నట్లు తెలిసింది. గణపవరం మండలాన్ని తిరిగి ఏలూరు జిల్లాలో కలపనున్నట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో ఉన్న నూజివీడు, కైకలూరు నియోకవర్గాలను విడదీస్తే ఏలూరు జిల్లా అతిచిన్నగా మారిపోనుంది. ఏలూరు, జంగారెడ్డిగూడెం రెండు డివిజన్లు మాత్రమే మిగలనున్నాయి. ఈ నిర్ణయంపై ప్రజాప్రతినిధులు పైకి మాట్లాడకపోయినా ప్రభుత్వంపై తీవ్రం ఒత్తిడి తెచ్చినట్లు చెబుతున్నారు.

**ఏకపక్షంగా చేస్తున్నారన్న విమర్శలు..**

జిల్లాల మార్పులు, చేర్పులపై ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళ్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రుల కమిటీ ప్రజల నుంచి వినతులు స్వీకరించకుండా, ఎవరి అభిప్రాయం తెలుసుకోకుండా నివేదిక ఎలా తయారు చేస్తుందన్న చర్చ జనాల్లో నడుస్తోంది. రెండు నియోజకవర్గాలను విభజించే ముందు జిల్లా భౌగోళిక పరిస్థితులను ఏమాత్రమూ పరిగణలోకి తీసుకోకుండా ముందుకు సాగుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ప్రత్యేక అథారిటీ ఏర్పాటు అంటూ చెప్పడంపై గిరిజనుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. డిసెంబర్‌లోపు జిల్లాల మార్పులు, చేర్పులు పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రెండు రోజుల క్రితం జరిగిన మంత్రి మండలి సమావేశంలో జిల్లాల సమస్యలపై ఎందుకు చర్చించలేదన్న అనుమానం నెలకొంది. జిల్లాల మార్పులు, చేర్పులపై అన్నివర్గాల అభిప్రాయాలు తీసుకుని ముందుకు సాగితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఒక్కరోజే 15,024 ఇళ్లకు గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

'మన ఇల్లు - మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు పట్టణం 25వ వార్డు గాంధీనగర్‌లోని లబ్ధిదారు తురకా అంకమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం పాల్గొన్నారు. గృహ ప్రవేశం అనంతరం కుటుంబ సభ్యులతో గృహ ప్రవేశ పూజలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారు దంపతులకు నూతన వస్త్రాలు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఒక్కరోజే 3 లక్షల నిరుపేదల గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహిస్తోందని, దీనిలో భాగంగా జిల్లాలో బుధవారం ఒక్క రోజే 15,024 నూతన గృహాలకు గృహప్రవేశం జరుగుతోందన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కొత్తగా ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా సంబంధిత గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, నూజివీడు సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, మున్సిపల్ కమిషనర్ పేరయ్య, గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, కౌన్సిలర్ పాదం సీతాదేవి, తహశీల్దార్ పాల్గొన్నారు

గృహ ప్రవేశంలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి

## పట్టిసీమలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### రైతుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు : ట్రైకార్ ఛైర్మన్

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ, కొత్త పట్టిసీమ గ్రామాల్లో ఖరీఫ్ 2025 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం సమగ్ర ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. వరికి మద్దతు ధర క్వింటాకు కామన్ రకానికి గాను రూ.2,369, గ్రేడ్ ఏ రకానికి 2,389 రూపాయలుగా నిర్ణయించినట్లు చెప్పారు. మండలంలో మొత్తం ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు పోలవరంలో 1, పోలవరం 3, పట్టిసీమ, ప్రగడపల్లి, గూటాల, కొత్త పట్టిసీమలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండల వ్యాప్తంగా 8,150 ఎకరాల్లో వరి సాగు చేయగా, సుమారు ఆరు లక్షల గోనె సంచులు సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన గోనె సంచులు ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ధాన్యం నాణ్యతాపరంగా తేమ శాతం 17 శాతంలోపు ఉండాలని సూచించారు. అదనంగా ప్రభుత్వం క్వింటాకు 22 రూపాయలు హమాలీ ఛార్జీలు, రవాణా ఖర్చులు కూడా భరిస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ ప్రతిరోజూ పనిచేయనున్నాయని, ప్రతి కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్, హెల్పర్ సొసైటీ ద్వారా నియమించబడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు నునకాని రాంబాబు, కొత్త పట్టిసీమ సొసైటీ అధ్యక్షుడు పూడి వెంకట్రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ట్రైకార్ ఛైర్మన్

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తా

### నూజివీడు ఏరియా ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నిరుపేదల వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించే వైద్యులు, వైద్య సిబ్బందిని సస్పెండ్ చేస్తానని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రతి వార్డునూ, వైద్య విభాగాన్నీ పరిశీలించారు. ఆసుపత్రిలో సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఒపి విభాగంలో రోగులకు సక్రమంగా వైద్య సేవలందించకపోవడం, ఆసుపత్రిలో అపారిశుధ్యం, సిసి కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం, రోగుల రద్దీని నియంత్రించకపోవడం, ఎన్‌టిఆర్ వైద్య సేవా సిబ్బంది నిర్లక్ష్యం వంటి వాటిని పరిశీలించి ఆసుపత్రిలో సేవలు పర్యవేక్షించే వైద్యాధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న ప్రభుత్వ ఆశయాల మేరకు వైద్య సిబ్బంది పనిచేయాలని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు స్వాంతన చేకూరే విధంగా వైద్యులు చికిత్స అందించాలని తెలిపారు. రోగులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరితగతిన చికిత్స అందించాలన్నారు. రోగుల పట్ల సేవా లోపం, విధుల పట్ల నిర్లిప్తత ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తాను ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీలు చేస్తానని, ఎక్కడైనా వైద్య సిబ్బంది సేవాలోపం గుర్తిస్తే వెంటనే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రసూతి, లేబర్ వార్డుల్లో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత లేకపోవడం, ఒపి నమోదు, ఎక్స్‌రే, స్కానింగ్ విభాగాల వద్ద సరైన నియంత్రణ లేకపోవడం, వార్డుల్లో పరిశుభ్రత లేకపోవడం, వాహనాల పార్కింగ్ సక్రమంగా నిర్వహించకపోవడం, తదితర అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆసుపత్రి ఆర్ఎంఒల నుంచి వివరణలు తీసుకోవాలని కలెక్టర్ డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు.

**డిసిహెచ్ఎస్ పై కలెక్టర్ ఆగ్రహం**

ఆధునిక వైద్య పరికరాలు, బెడ్స్‌ను ఆసుపత్రికి ప్రభుత్వం సమకూరుస్తే వాటిని వినియోగించకుండా స్టోర్స్‌లో నిరుపయోగంగా ఉంచడంపై కలెక్టర్ వెట్రిసెల్వి డిసిహెచ్ఎస్ పాల్ సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మజపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిని మళ్లీ తనిఖీ చేస్తానని, అప్పటికీ వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆసుపత్రి ఆర్ఎంఒ శ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ కామేష్, తహశీల్దార్ ప్రభృతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ, రగ్బీ పోటీలకు

## టి.నరసాపురం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, రగ్బీ పోటీల్లో టి.నరసాపురం హైస్కూల్ విద్యార్థులు 12 మంది ఎంపికైనట్లు హెచ్ఎం బి.లింగస్వామి తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 3న జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 7, 8, 9 తేదీల్లో కడప జిల్లా పులి వెందులలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సిహెచ్.వినయ్, ఆర్.నాగరాణి, కె.లావణ్య ఎంపికయ్యారని తెలిపారు. అదే విధంగా ఈ నెల 4న జంగారెడ్డిగూడెంలో జరిగిన జిల్లా సాయి స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్ - 17 విభాగంలో 9 మంది విద్యార్థునులు బాలికలు అండర్ - 14, సిరిబిందు అండర్ -17 బాలికల విభాగంలో - ప్రసన్న, ఎన్.దుర్గ, బాలుర విభాగంలో అండర్ 14లో బి.పవన్, డి.ప్రశాంత్, అండర్ 17 విభాగంలో బి.దయాకర్, ఎన్.కౌషిక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి గన్నవరం, నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్మాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 8న గోపన్నపాలెంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ ఎంపికల్లో విద్యార్థులు అండర్-14 విభాగంలో కె.సాయిదీపక్, అండర్-17 విభాగంలో కె.సందీప్ ఎంపిక కావడంతో మచిలీపట్నం, కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు అడపా రామకృష్ణను స్కుల్ సిబ్బంది ఎస్ఎంసి ఛైర్మన్, గ్రామస్తులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఒ పిజె.అమృతం హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పిసిపి ఎన్‌టిటి 1994 సలహా కమిటీ జిల్లా స్థాయి సమావేశం వైద్యాధికారుల కమిటీ సభ్యులతో ఆమె అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లింగ ఎంపిక నిషేధ చట్టం తీసుకొచ్చి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాయన్నారు. జిల్లాలో 115 ప్రభుత్వ, ప్రయివేట్ స్కానింగ్ సెంటర్లలో ఎప్పటికప్పుడు అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి పూర్తిస్థాయిలో నివేదికలను అందించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై అధికారులు బృందంతో వెళ్లి విచారణ చేసి రుజువైతే ఆయా స్కానింగ్ సెంటర్లను సీజ్ చేసి జరిమానా వేసి జైలు శిక్ష విధిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిఐఒ డాక్టర్ శోభ, గైనకాలజిస్ట్ డాక్టర్ లావణ్య, పీడియాట్రిషన్ డాక్టర్ లక్ష్మీకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండాలి

### రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మారెడి

ప్రజాశక్తి - భీమడోలు

పాఠశాల విద్యార్థులందరూ నూరుశాతం మధ్యాహ్న భోజన పథకం సేవలను వినియోగించుకునే విధంగా కృషి చేయాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మారెడ్డి కోరారు. ఆయన భీమడోలు మండలంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా సూరప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని జెఎంఎం.పురం ఆవాస ప్రాంతంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను, భీమడోలు హైస్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. నిల్వలను తనిఖీలు చేశారు. పదార్థాల నాణ్యతను పరిశీలించే క్రమంలో వాటిని రుచి చూశారు. విద్యార్థులతో, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులతో, ఉపాధ్యాయులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలను, సూచనలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా అధికారులు వెంకటప్పయ్య, కుమార్, మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కరకుమార్, అరుణకుమార్, సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



భోజనం పరిశీలిస్తున్న లక్ష్మారెడ్డి

**ఉంగుటూరు :** అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారాన్ని కూడా నాణ్యతగా అందించాలని ఎని ఫుడ్ కమీషన్ సభ్యులు లక్ష్మారెడ్డి అన్నారు. ఉంగుటూరు మండలం కైకరంలో 242 కోడ్ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారుల బరువు, మెనూ అమలు తీరును పరిశీలించారు. ఆహార నిల్వల నాణ్యతను తనిఖీ చేశారు. లబ్ధిదారులకు టిహెచ్ఆర్‌తో కేంద్రంలో చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పించే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని, ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ జిల్లా పీడీ శారద, పౌరసరఫరాల శాఖ డిఎం మూర్తి, డిఎస్ఒ విల్సన్, భీమడోలు సిడిపిఒ సునీల్ రాజ్ శేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విజయలక్ష్మి సేవలు ఎనలేనివి

### సంస్మరణ సభలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి జి.విజయలక్ష్మి 5వ వర్ధంతి సందర్భంగా స్థానిక పవర్ పేటలోని ఐద్వా జిల్లా కార్యాలయంలో బుధవారం సంఘం జిల్లా అధ్యక్షులు పి.హైమావతి అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో ఏలూరు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ విజయలక్ష్మి 40 సంవత్సరాలు మహిళల హక్కులు, వేధింపులు, దాడులు వంటి సమస్యలపై పనిచేశారని, ఆమె న్యాయ సహాయ కేంద్రం నడిపి అనేకమంది మహిళలకు అండగా నిలిచారని తెలిపారు. అంతేగాక ఆమె మంచి గాయని అని, ఆమె మరణించి 5 సంవత్సరాలు అవుతోందని, అయినా నేటికీ ఆమె సేవలు, కృషి స్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.అరుణకుమారి, ఎం.సింహాచలం, వి.ప్రసాద్, వై.కనకారావు, జాన్, ఎం.సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు.

సభలో మాట్లాడుతున్న నేతలు

## వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి

### వైసిపి ఆధ్వర్యాన ఆందోళనలు



నూజివీడులో...

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకరిస్తూ నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాలేజీల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ కోటి సంతకాల స్వీకరణ జరుగుతుందని, పూర్తయిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్‌ను కలవనున్నట్లు తెలిపారు.

**బుట్టాయగూడెం :** రాష్ట్రంలో వైద్య విద్యను పిపిపి పేరుతో ప్రయివేటీకరణ చేస్తున్నారని వైసిపి పోలవరం నియోజకవర్గ శ్రేణులు బుధవారం మండల కేంద్రంలో శివాలయం నుంచి భారీ ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దార్ చలపతిరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైసిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడారు. వైద్య విద్యను సామాన్య ప్రజలకు దూరం చేయడానికి, పూర్తిగా ఆర్థిక వనరుగా చేసుకోవడానికి టిడిపి కూటమి ప్రభుత్వం చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, ఎంపిటిసి గగ్గులోతు మోహన్‌రావు, బానోతు కృష్ణనాయక్, నియోజకవర్గంలోని ఏడు మండలాల వైసిపి కన్వీనర్లు, వైసిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో...

**ఉంగుటూరు :** ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ, పిఎసి సభ్యులు పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు నిరసన ర్యాలీ చేసుకుంటూ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరద మంగారావు, కుమార్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి పాల్గొన్నారు.

ఉంగుటూరులో...

**ఏలూరు సిటీ :** కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించడంపై వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో ఏలూరులోని పెరుగుచెట్టు వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి మండల రెవెన్యూ అధికారి వారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పది మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెస్ జమ అయ్యేలా చర్యలు

### జిల్లా గ్రంథాలయ సంస్థ భవనాన్ని సందర్శించిన జెసి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా గ్రంథాయాల సంస్థ భవనాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉందని తెలిసి పరిస్థితులను అధ్యయనం చేసి త్వరలో గ్రంథాలయ నిర్వహణకు అనుకూలమైన వసతి అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. స్థానిక సంస్థల నుంచి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ సెస్ కూడా జమ అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి, వివిధ కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులను కలిసి కొంతసేపు సంభాషించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, సిబ్బంది ఎల్.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి అభిషేక్ గౌడ్

## సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

నూజివీడు మండల పరిధిలోని హనుమంతులగూడెం, వెంకటాయపాలెం గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించారు. గ్రామంలో జరిగే ఇంటి పన్ను వసూలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునే లబ్ధిదారులు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని పారిశుద్ధ్యం, తాగునీటి వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఎంపిడిఒతో ఐసిడిఎస్ సిడిపిఒ పిల్లి విజయకుమారి పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

**ఎంపిడిఒకు రాష్ట్ర మంత్రి అభినందన**

నూజివీడు ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్‌ను అభినందిస్తూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ వీర బాలాంజనేయ స్వామి బుధవారం లేఖ పంపారు. ఇటీవల సంభవించిన తుపాను వాతావరణంలో ప్రజలను సంరక్షించడం, పునరావాస కేంద్రాలు ఏర్పాటు, ఇతర సౌకర్యాలు కల్పించి, వంద శాతం సేవలు అందించినందుకు అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరించిన తీరు ప్రశంసనీయమని లేఖలో పేర్కొన్నారు.

## శ్రీ సిద్ధార్థ విద్యార్థినుల ప్రతిభ

**ప్రజాశక్తి - నూజివీడు టౌన్**

పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ నెల 11వ తేదీన ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలకు చెందిన బి.లీలకృష్ణ మనోజ్ఞ, కూచిపూడి డ్యాన్స్ విభాగంలో జిల్లా ద్వితీయ స్థానం, ఫోక్ డ్యాన్స్ విభాగంలో జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. సిహెచ్.నిఖిల ఎలక్యూషన్ విభాగంలో జిల్లా తృతీయ స్థానం సాధించింది. ఈ విద్యార్థినులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపల్ జి.శ్రీమన్నారాయణ, ఇతర అధ్యాపకులు అభినందించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి - మండవల్లి**

దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని భైరవపట్నం గ్రామ ప్రముఖులు, కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. మండలంలోని అల్లినగరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జంపాన వీరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు (కొండ), నీటి సంఘం అధ్యక్షులు ఎలికే రాంబాబు, నాయకులు బోయిడి సురేష్, వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

**ప్రజాశక్తి - నిడమర్రు**

విశాఖపట్నంలో జరిగే సిఐటియు. 18వ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండలంలోని నిడమర్రు, భువనపల్లి గ్రామాల్లో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలు పంపిణీ ప్రచారం చేస్తూ ఈ జాతీయ మహాసభకు ఆర్థిక సహకారం అందించాలని, కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికి మాస్ క్యాంపెయిన్ చేశారు. ఈ కార్యక్రమంలో నారపల్లి రమణారావు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, లావేటి సోంబాబు, కానూరు రాజు, సంకు కోటి, కమిలి నాని, తదితరులు పాల్గొన్నారు.

## ఆటల్లో రాణించిన రమణక్కపేట విద్యార్థులు

**ప్రజాశక్తి - ముసునూరు**

తమ పాఠశాల విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ తెలిపారు. పాఠశాలలలో వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 7, 8, 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 11 వ సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా మహిళల జట్టు తరుపున అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచారన్నారు. లీగ్ దశలో, కడప, గుంటూరు, జిల్లాల పై, నాకౌట్ దశలో అనంతపురం జిల్లాపై విజయం సాధించి సెమీ ఫైనల్స్ కు అర్హత సాధించారన్నారు. టి.నాగ సుధ, డి.జెస్సీ లు ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

## చింతలపూడి విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి - చింతలపూడి**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలలో అథ్లెటిక్స్ ఈ నెల 10, 11 తేదీల్లో రాజమండ్రి గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ అటానమస్ వారి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థిని వి.భార్గవి డిస్కస్ విభాగంలో యూనివర్సిటీ పరిధిలో ప్రతిభ చాటి బ్రౌంజ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ సంవత్సరం వరుసగా పాల్గొన్న రెండు విభాగాల్లో ఆర్చరీలోనూ, అథ్లెటిక్స్‌లోను కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినందుకు విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ అలీని అభినందించారు.

## రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి - భీమడోలు**

గ్రామాభివృద్ధితో పాటు, సంక్షేమ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జాతీయ రహదారి నుంచి చిన్న లింగంపాడు, సాధు దిబ్బ ఆవాస ప్రాంతాల మీదుగా పెద్ద లింగంపాడువరకు రూ.95 లక్షల నాబార్డ్ నిధులతో నిర్మించనున్న సీసీ, బిటి రోడ్డు నిర్మాణానికి ఎంఎల్‌ఎ ధర్మరాజు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు.

## 'ఆరోగ్యాంధ్రప్రదేశే కూటమి లక్ష్యం'

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యంగా సిఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి చెప్పారు. ఆ లక్ష్యానికి సుస్థిరమైన బాటలు వేస్తున్నారని, అందులో భాగంగానే సఖి సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఏలూరు అగ్రహారంలోని మర్చంట్స్ ఛాంబర్ కళ్యాణ మండపంలో బుధవారం మెప్మా ఆధ్వర్యంలో సఖి సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు 35 ఏళ్ల పైబడిన స్వయం సహాయ సంఘాల సభ్యులైన మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించే ధ్యేయంగా చేపట్టిన కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైద్యపరీక్షలు నిర్వహించిన తీరును స్వయంగా పరిశీలించిన వారు అక్కడున్న మెప్మా అధికారులకు, సిబ్బందికి, వైద్యులకు పలు సూచనలు చేశారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**ముదినేపల్లి :**ముదినేపల్లిలో యాచకురాలు దహన సంస్కారాల నిమిత్తం రూ.ఐదు వేల నగదును డాక్టర్ మనోజ్ బుధవారం అందించారు. ముదినేపల్లి గ్రామంలోని కాలువ గట్టు వద్ద భిక్షాటన చేస్తూ ఒంటరిగా నివసిస్తున్న మానికల దుర్గమ్మ (60) అనారోగ్య కారణాల వల్ల బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. యాచకురాలు మరణ వార్త తెలుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి, తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా రూ.ఐదు వేల నగదును మరణించిన దుర్గమ్మ సన్నిహితులకు దహన సంస్కారాల నిమిత్తం అందించారు.

### నేరాలు - ఘోరాలు

## రేషన్ బియ్యం పట్టివేత

**జీలుగుమిల్లి :**మండలంలోని దర్భగూడెం గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న ఎనిమిది బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దర్భగూడెం గ్రామంలో రేషన్ లబ్ధిదారుల దగ్గర తక్కువ రేట్‌కు కొని బహిరంగ మార్కెట్‌లో అధిక రేట్‌కు అమ్ముతూ వ్యాపారం చేస్తున్న వ్యక్తి ఇంట్లో నిల్వ ఉన్న ఎనిమిది బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

**ఎంఎల్‌ఎలు, కూటమి నేతలు**

ఏలూరులో...

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో కూటమి ప్రభుత్వం ఎక్కడా రాజీలేని మార్గంలో పయనిస్తుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఇదేక్రమంలో పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యతను కూడా అంతే సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఏలూరులో బుధవారం స్థానిక మాదేపల్లి ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన గృహాల సామూహిక గృహప్రవేశ కార్యక్రమం లబ్ధిదారుల మధ్య జరిగింది. ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నగర మేయర్ షేక్ నూర్జహాన్, లబ్ధిదారులతో కలిసి ఎంఎల్‌ఎ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లబ్ధిదారులకు వారి ఇంటి తాళాలను అందించారు. మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

**చింతలపూడి :** ప్రతి పేదవాడి సొంత ఇంటికల సాకారం చేయడమే తమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్లాయగూడెంలో ఎంఎల్‌ఎ ఆధ్వర్యంలో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, సర్పంచి కవిత, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో...

**జీలుగుమిల్లి :** అర్హులైన ప్రతిఒక్కరికీ ఇల్లు నిర్మించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు అన్నారు. గృహ ప్రవేశ మహోత్సవంలో భాగంగా గృహాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**భీమడోలు :**సామాన్యుని సొంతింటి కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్జావారిగూడెం ఆవాస ప్రాంతంలో దాసరి కృష్ణవేణి గృహ నిర్మాణ సంస్థ సహకారంతో నిర్మించిన గృహానికి ప్రారంభోత్సవం చేశారు. గృహ యజమానులను నూతన వస్త్రాలతో సత్కరించారు. స్వీట్లు తినిపించారు. అంతకుముందు ఆవాస ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు.

ముసునూరులో..

**ముసునూరు :** ప్రతి కుటుంబం తమకంటూ ఒక ఇల్లు నిర్మించుకుని ఉంటే ఎంతో ఆనందదాయకంగా ఉంటుందని టిడిపి నాయకులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని 16 గ్రామపంచాయితీ పరిధిలోని ఆయా గ్రామ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో నూతన గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, మేదరమెట్ల సురేంద్ర, గద్దల మోహనరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, బొమ్మకంటి శ్యామలరావు, గరిక ముక్కు నాని, ఉప్పలపాటి గణేష్, తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, తోట శ్రీను, గార్లపాటి నరసింహారావు, దేవినేని డలరామ్, దేవినేని శ్రీధర్, పులి బళ్ల లక్ష్మీసత్యనారాయణ, సూరేపల్లి మల్లిబాబు, కాటేపల్లి ప్రసాద్, మందలపు ధర్మరాజు, కొల్లి గంగారం, కొల్లి కృష్ణయ్య, తహశీల్దార్ బి.ప్రశాంతి, ఎంపిడిఒ సి.ఏసుబాబు, ఉప ఎంపిడిఒ బసవరాజు సత్యనారాయణ, హౌసింగ్ ఎఇ దివాకర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఆగిరిపల్లిలో...

**ఆగిరిపల్లి :**ఇల్లు లేని ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కలను నేరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి మండలాధ్యక్షులు నక్కనబోయిన వేణు అన్నారు. ఎంపిడిఒ బి.భార్గవితో కలిసి మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం, చొప్పరమెట్ల గ్రామాల్లో నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించి, వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గొల్లగూడెం సర్పంచి లింగవరపు రమేష్, చొప్పరమెట్ల సర్పంచి కూరాకుల ఊర్మిళ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లిపర సాంబశివరావు, నలజాల హరిబాబు, కాజ కుటుంబరావు, నరదల సాంబయ్య, పానుగంటి గోపీ, తదితరులు పాల్గొన్నారు.


భీమడోలులో...

## వసతులు కల్పించకపోతే ఇళ్ల నిర్మాణం ఎలా

**మండవల్లి :**ఇళ్లు నిర్మించుకునేలా వసతులు కల్పించకపోతే ఇళ్ల నిర్మాణం ఎలా చేపట్టాలని లబ్ధిదారులు అధికారులను నిలదీశారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇంగిలిపాకలంకలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులు అధికారులను ప్రశ్నించారు. రహదారులు, విద్యుత్ సౌకర్యం లేవని మెటీరియల్ తెచ్చి ఏం చేయాలని లబ్ధిదారులు ప్రశ్నించారు. ఇళ్ల స్థలాలను కొల్లేరు సమీపాన ఏర్పాటు చేయడంతో ఎంత మెరక చేసినా బురదగానే ఉంటుందని, పిల్లర్లు దిగిపోతున్నాయని లబ్ధిదారులు అధికారులకు తెలిపారు. మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే ఇల్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు.

## ముగిసిన శిక్షణా తరగతులు

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుదలపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల సర్పంచి, కార్యదర్శుల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.మణికుమారి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు పెంపొందించాలని, అందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. పంచాయతీలో సొంత వనరులు చెట్లు, చెరువులు, షాపింగ్ కాంప్లెక్స్, కుళాయి నీటి పన్నులు, భవన నిర్మాణ అనుమతులు, ఫీజులపై వచ్చే ఆదాయం గ్రామాభివృద్ధికి వినియేగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో టిఒటిలు ఎన్.నాగలక్ష్మి, బి.శైలజ శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు.

## బాధిత కుటుంబాలకు ఎంఎల్‌ఎ పరామర్శ

**ప్రజాశక్తి - చింతలపూడి**

లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెం గ్రామంలో ఇటీవల ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురై ఆకస్మిక మరణం పొందిన వీరంకి ప్రవీణ్‌బాబు కుటుంబాన్ని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ప్రవీణ్ బాబు చిత్ర పటానికి పుష్పాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే అదే గ్రామానికి చెందిన చిట్టిమాది సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగఢ సానుభూతి తెలిపారు.

## ఆర్ఒ ప్లాంట్ మరమ్మతులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

కోడిగూడెం ఎంపియుపి స్కూల్‌లో ఆర్ఒ ప్లాంట్ మరమ్మతులు, పాట్‌ఫారం నిర్మాణం నిమిత్తం గ్రామానికి చెందిన అడ్వొకేట్ బాతుల వేణు రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సహాయాన్ని ప్రధానోపాధ్యాయులు దేవానందరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో రవి, త్రిమూర్తులు బాలకృష్ణ పాల్గొన్నారు.

## బాధితులకు శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్ సాయం

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

టి.నరసాపురం మండలంలోని కేతవరం క్లస్టర్‌లో సిఆర్‌పిగా విధులు నిర్వహిస్తున్న బి.రమేష్ గత కొన్ని రోజులుగా మూత్రపిండాలు, రక్త ఇన్‌స్పెక్షన్ వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం ఏలూరు సిరి హాస్పటల్‌లో వైద్యం పొందుతున్నారు. ఆయన ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా మారిన నేపథ్యంలో శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ ఏలూరు సంస్థ తన మానవతా దృక్పథాన్ని మరోసారి చాటిచెప్పింది. ఈ సంస్థ తరపున రూ.పది వేల ఆర్థిక సహాయం బుధవారం ఫ్యాప్టో ఛైర్మన్ జి.మోహన్ చేతుల మీదుగా రమేష్‌కు అందించారు. అలాగే ఇందిరా కాలనీ వెంకటాపురం పంచాయతీ పరిధిలో నివసిస్తున్న నల్లమిల్లి శ్రీహర్ష, జెడ్‌పిహెచ్ఎస్ ఇందిరా కాలనీలో ఎనిమిదో తరగతి చదువుతూ గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు.

## మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించొద్దు

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేయడమంటే పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారడమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. పట్టణంలో యుటిఎఫ్ మండల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జంగారెడ్డిగూడెం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉండగా వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతుందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ మాట్లాడుతూ లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం రోడ్లపై నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం మెత్తని వైఖరి అవలంభిస్తోం దన్నారు. జాబ్ క్యాలెండర్‌ను రద్దు చేసి యువతను మోసం చేస్తున్నారు. అనంతరం 13 మందితో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఏర్పాటు చేశారు. మండలాధ్యక్షుడిగా కె.శేషాద్రి, కార్యదర్శిగా డి.నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా ఉదయ్ కిరణ్, ఉపాధ్యక్షురాలిగా కె.రమ్యశ్రీ, సహాయ కార్యదర్శిగా కె.దేవిప్రియాంక, పాషా, జిల్లా కమిటీ సభ్యులుగా నాని, రాగమాలిక వంశీ, అన్విక్, శిరీష, రామాంజనేయులు ఎన్నుకున్నారు.

## 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

ఏలూరు బాలల గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను బాలల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు కారంశెట్టి రమేష్‌బాబు మాట్లాడుతూ పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలల గ్రంథాలయంలో నవంబర్ 14 నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, ప్రముఖులతో ప్రసంగాలు, సెమినార్లు, విద్యార్థుల కోసం వివిధ సృజనాత్మక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి కమిటీ సభ్యులు గోగు నరసింహారావు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ మాట్లాడారు.

**భీమడోలు :**భీమడోలు శాఖా గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు హామీ ఇచ్చారు. భీమడోలులోని టిడిపి కార్యాలయంలో బుధవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రిక, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు కె.శ్రీనివాస్‌తో పాటు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించే వివిధ కార్యక్రమాలు, పోటీల గురించి వివరించారు. గ్రంథాలయానికి సొంత భవనం లేని కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆప్కాబ్ ఛైర్మన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్.ఎస్.గిరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాను జయప్రదం చేయాలని ఆగిరిపల్లి గ్రంథాలయ అధికారి ఇజిఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

## పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాల కల్పన : డివైఇఒ

**జీలుగుమిల్లి :** మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు డివైఇఒ ఎం.రామన్నదొర తెలిపారు. మండలంలో జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బర్రింకలపాడు గిరిజన గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను ఎసిఆర్ ఆశాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు విద్యా శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.ఆశా, ఎంఇఒలు కె.శ్రీనివాస్, బుచ్చయ్య, ప్రధానోపాధ్యాయులు టి.చంద్రావతి, శ్రీపాద రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

## ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఉన్నత విలువలతో కూడిన విద్యతోపాటు విద్యార్థుల్లో ఉద్యోగ స్ఫూర్తి, క్రమశిక్షణ, సాంస్కృతిక ప్రతిభను అభివృద్ధి చేసే దిశగా కళాశాల కృషి చేస్తోందని ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 10, 11 తేదీల్లో జరిగిన యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీల్లో ఆదిత్య కళాశాల విద్యార్థులు ఎండి.అమీనా డిస్కస్ త్రోలో బంగారు పతకం, జి.నరేంద్ర సిద్దు 110 మీటర్ల హెచ్‌ఆర్‌డిలో కాంస్య పతకం సాధించారని తెలిపారు. సెట్‌వెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా యువజన ఉత్సవాల్లో ఆదిత్య విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు దక్కించుకున్నారని, కూచిపూడి నృత్యంలో బి.బృందా ప్రథమ బహుమతి, చిత్రలేఖనంలో గాయత్రి ద్వితీయ బహుమతి, జానపద నృత్యం గ్రూప్‌లో కాంతిశ్రీ బృందం ద్వితీయ బహుమతి, వాయిద్యంలో కైలాష్ ప్రోత్సాహక బహుమతి పొందారని, రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొనేందుకు జానపద నృత్యం గ్రూప్ ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను బుధవారం కళాశాలలో ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ నల్లమిల్లి సుగుణ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ నాయుడు అభినందించారు.

## న్యూమోనియ పట్ల అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

చలి వాతావరణం వల్ల ప్రజలు ఎక్కువగా అనారోగ్య సమస్యలతో బాధపడే అవకాశం ఉందని, న్యూమోనియా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక కొత్తపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ న్యూమోనియా దినోత్సవం సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. శీతాకాలంలో చలి వాతావరణం ఎక్కువగా ఉండడంతో ప్రజలు దగ్గు, జలుబు, ఆయాసం, తుమ్ములు, ఆస్మా, జ్వరాలు, తీవ్రమైన న్యూమోనియతో బాధపడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఐదేళ్ల సంవత్సరాల లోపు పిల్లలు, వయసులో పెద్దవారు న్యూ మోనియాతో బాధపడే అవకాశం ఉందన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేసుకోవాలన్నారు. చలి నుంచి రక్షణ పొందాలని సూచించారు. డెంగీ, మలేరియా తదితర జ్వరాలకు కారణమైన దోమలు అభివృద్ధి చెందకుండా డ్రై డే ఆచరించాలని సూచించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మేకా శ్రీనివాసరావు, రామకృష్ణ, రమాదేవి, నీలాదేవి, వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు సుమలత పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం :**ఐదేళ్ల లోపు పిల్లల్లో న్యూమోనియా నివారణ కోసం ఈ నెల 12వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆరోగ్య సిబ్బంది ద్వారా సాన్స్ సర్వే నిర్వహించనున్నట్లు బయ్యన్నగూడెం పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి యెల్లా సుబ్రహ్మణ్యం తెలిపారు. వేదాంతపురం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల తల్లులకు న్యూమోనియా లక్షణాలు, నివారణ చర్యలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఎన్.వినోద్‌కుమార్, ఎఎన్ఎం కె.గంగాదేవి, హెల్త్ అసిస్టెంట్ కె.మోహన్, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇండియన్ బ్యాంక్, కొత్తపేట, నూజివీడు బ్రాంచి**
इंडियन बैंक Indian Bank इलाहाबाद ALLAHABAD
కొత్తపేట, నూజివీడు- 521201, ఏలూరు జిల్లా., ఎ.పి., ఫోన్:08656-232715

**బంగారు ఆభరణముల వేలం ప్రకటన**

ఈ దిగువ పార్టీలు జ్యూవెల్ / గోల్డ్ లోన్‌ను పొంది మరియు ఎన్ని నోటీసులు ఇచ్చినప్పటికీ నిర్ణీత సమయంలోగా విడిపించుకోవడంలో విఫలమయ్యారు. ఒకవేళ వీరు తాకట్టుపెట్టిన ఆభరణములు ది.15.11.2025 మధ్యాహ్నం 12.00 గంటల లోగా విడిపించుకోవడంలో విఫలమైతే, వారి యొక్క ఆభరణములను ది.15.11.2025, సాయంత్రం 3-30 గంటలకు మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. వేలంపాటలో పాల్గొనువారు ధరావత్తు రూ.5,000/- ది.15.11.2025, మ॥ 2-00 గంటలలోపు చెల్లించవలెను.

| ఋణగ్రహీత యొక్క పేరు మరియు చిరునామా | లోన్ అకౌంట్ నెంబరు | మంజూరైన అమౌంట్ | లోన్ యొక్క తేది | గరిష్ట బరువు |
|---|---|---|---|---|
| నూర్ భాషా ఇబ్రహీమ్, S/o.మౌలాసాహెబ్ 406, కొత్తపేట, వెంకటేశ్వర కోవెల వేణుక కొత్తపేట, నూజివీడు, క్రిష్ణా, ఎ.పి. పిన్ - 521201. | 7041743324 | రూ. 38,500 /- | 13.07.2021 | 12.2 గ్రా॥ |
| | 7100399282 | రూ. 52,000 /- | 16.10.2021 | 17.0 గ్రా॥ |

**ముఖ్య నియమ నిబంధనలు : 1)** రిజిష్టర్డ్ నోటీసులకు పార్టీలు స్పందించలేదు లేదా బట్వాడా కాకుండా తిరిగి వచ్చినవి. **2)** ఒకవేళ ఋణగ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. **3)** ధరావత్తును బ్యాంకు వారు వేలం తేది మధ్యాహ్నం 2.00 గం॥ల వరకు మాత్రమే స్వీకరించబడును. **4)** విజయవంతమైన పాటదారుడు వేలం ముగిసిన వెంటనే ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను. **5)** వేలం సమయంలో మాత్రమే ఆభరణాలు తనిఖీ కోసం అందుబాటులో ఉంటాయి. **6)** ఏవిధమైన ముందస్తు ప్రకటన లేకుండగనే వేలంను పాక్షికముగా గానీ పూర్తిగా గాని రద్దు చేయు లేదా వాయిదావేయు అధికారము బ్యాంక్‌కు కలదు. **7)** వేలములో పాల్గొనేముందు బిడ్డర్లు ఋజువులను సమర్పించవలసి ఉంటుంది. **8)** ఆభరణాలు **"ఎక్కడ ఎలా ఉంటే అలాగే"** షరతుల ప్రకారం మరియు బిడ్డర్ యొక్క రిస్క్ మరియు బాధ్యతతోనే వేలంలో విక్రయించబడును. మరిన్ని వివరాల కోసం పై చిరునామాలో బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.

**తేది: 12.11.2025** ప్రదేశం: నూజివీడు సం/- శాఖాధికారి, ఇండియన్ బ్యాంక్

## ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాల వేలం

**నూజివీడు టౌన్ :**పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో మొత్తం 31 వాహనాలు వేలం పెట్టగా అందులో 27 వాహనాలు విజయవంతంగా వేలం అయ్యాయి. ఈ వేలం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన అంచనా విలువ రూ.1.50 లక్షలు కాగా ప్రత్యక్ష వేలం ద్వారా మొత్తం ఆర్జన రూ.1,67,100 వచ్చింది. ఈ విధంగా ప్రభుత్వ అంచనా రాబడితో పోల్చితే 12 శాతం అధిక ఆదాయం నమోదైంది. వాహనాల వేలం ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.

## బాధితునికి ఆర్థిక సాయం

**ముసునూరు :** ముసునూరుకు చెందిన పోట్రు భూపతియ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబానికి టిడిపి గ్రామ అధ్యక్షులు గార్లపాటి నరసింహారావు రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అంతదించారు.

**మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**
**ఐ.ఎ. 1061/2025 ఇన్ ఓ.ఎస్. 392/25**

కాసా వెంకటేశ్వర్లు ...పిటీషనరు/వాది
వర్సెస్
1) కలివేపల్లి సుబ్బారావు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

**టు,**
**ఆర్-3,**
అచ్యుత శ్రీను, తండ్రి: హరిబాబు,
నివాసం: డోర్ నెం: 2-17, మెయిన్ రోడ్డు,
పాలచర్ల గ్రామం మరియు పోస్టు,
జిలుగు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాను మరియు పిటీషన్‌ను మీపై కోర్టులో దాఖలు చేయగా కోర్టు వారు ఐ.ఎ. 1061/25 నోటీసులు జారీ చేసిననూ ముట్టని కారణంగా పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేదీ: 27-11-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

**(కోర్టు వారి ఉత్తర్వులతో)**
వాయిదా: 27-11-2025 **ఇ.శారద, అడ్వకేట్, మార్కాపురం.**

**మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**
**ఓ.ఎస్. 392/2025**

కాసా వెంకటేశ్వర్లు ...వాది
వర్సెస్
1) కలివేపల్లి సుబ్బారావు మరియు ఇతరులు ...ప్రతివాదులు

**టు,**
**డి-3,**
అచ్యుత శ్రీను, తండ్రి: హరిబాబు,
నివాసం: డోర్ నెం: 2-17, మెయిన్ రోడ్డు,
పాలచర్ల గ్రామం మరియు పోస్టు,
జిలుగు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాను వాది, ప్రతివాదులపై కోర్టులో దాఖలు చేయగా కోర్టు వారు దావా సమన్లు జారీ చేయగా, మొదటి, రెండు ప్రతివాదులకు సమన్లు ముట్టి లాయర్‌ను నియమించుకున్నారు. కానీ డి-3 అయిన నీకు సమన్లు ముట్టని కారణంగా పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేదీ: 27-11-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

**(కోర్టు వారి ఉత్తర్వులతో)**
వాయిదా: 27-11-2025 **ఇ.శారద, అడ్వకేట్, మార్కాపురం.**

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు**
**ఎ.ఎస్.నెం.38/2024**

శ్రీ బొప్పన విఠల్ బాబు ...అప్పిలెంట్
మరియు
శ్రీ బూరగడ్డ వెంకట సుబ్బారావు (డైడ్)
శ్రీ కుతుంబాక రాంబాబు వగైరాలు ...రెస్పాండెంట్లు

పై నంబరు అప్పీలు గ్రంథములో 7వ రెస్పాండెంటు అయిన శ్రీ బూరగడ్డ ఎల్.వి.కె.కృష్ణమోహన్, తండ్రి బూరగడ్డ వెంకట సుబ్బారావు, పవరుపేట, ఏలూరు వారికి నోటీసు నిమిత్తం ది.27.11.2025వ తేదీకి వాయిదా అయివున్నది.

కాబట్టి 7వ రెస్పాండెంటు సదరు తేదీని పైకోర్టు వారి ఎదుట ఉదయం గం.1.30 ని॥లకు హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమున అప్పీలు తీర్మానించబడును.

ఏలూరు **ఎస్.వి.ఆర్.గాంధీ**
తేది.10.11.2025 అడ్వకేట్, ఏలూరు.

**In the Court of the Addl. Senior Civil Judge, Eluru (Senior Division)**
**O.S.No.411/2015**

Between:
Sri Chakka Uma Sankar Gupta ...Plaintiff
Vs
Sri Lanka Koteswara Rao and Others ...Defendants

**D17**: Sri Rayi Sujatha, S/o.Late Kommina Ganga raju, R/o. Madicharla, Nuzivid Mandal, Nuzvid, J.C.J.C., Krishna Dist.
**D18**: Sri Kommana Naga Jyothi, W/o.Satyanarayana, R/o.Denduluru Village and Mandal, Eluru Dist.

పై నెంబర్ గ్రంథములో Plaint Schedule ఆస్తి Register చేయించమని Court లో దాఖలు చేసిన పై నెంబర్ దావాలో 5వ ప్రతివాది కొమ్మిన గంగరాజు చనిపోయినందున వారి వారసులుగా D17, D18 లకు ఏమైన అభ్యంతరము ఉన్నయెడల ది.21.11.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారు ఎదుట హాజరు అయ్యి ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల మీకు పరోక్షంగా ఆర్డర్‌పాస్ చేయబడునని ఇందు మూలంగా తెలియచేయడమైనది.

**P.Bhaskara Narasimha Murthy**
Advocate, Eluru.
Cell: 9848143125.